




ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏపీ పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హెచ్చరించారు. శనివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ ఇంజనీరింగ్, ప్రజారోగ్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. పురమిత్ర యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కార మార్గం చూడాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. డ్రైన్ పూడికతీత పనులపై నిత్యం పర్యవేక్షణ పెట్టాలని అధికారులకు తెలిపారు.కార్పొరేషన్ కమిషనర్ నందన్ ,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ,టిడిపి సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ ,మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి ఉన్నారు.

కోవూరులో రాజకీయ సందిగ్ధత..!


- 'ప్రసన్న'ను అరెస్టు చేస్తారా
- దాడి చేసినవారిపై కేసు పెడతారా..
- పోలీసు కోర్టులో బంతి
- 17న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాక

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

కోవూరు ఎందరో రాజకీయ ప్రముఖులకు గౌరవం తెచ్చిన నియోజకవర్గం. 2019 తర్వాత ఏపి రాజకీయాలు కొత్త పుంతలు తొక్కాయి.

రాజకీయాలు రోజు రోజుకు దిగజారి పోతున్నాయి... ఓట్లు... సీట్లు... నోట్లు... వీటి చుట్టే తిరుగుతున్నాయి... అందుకే రాజకీయాలు వ్యక్తిగత అంశాలవైపు తిరుగుతున్నాయి.. ఒకప్పుడు గొప్పగొప్ప నాయకుల చరిత్ర గురించి చర్చించుకునే స్థాయి నుంచి వ్యక్తుల వ్యక్తిగత విషయాలు మాట్లాడుకునే స్థాయికి రాజకీయాలు దిగజారాయి. కోవూరు నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ సందిగ్ధత నెలకొంది. మాజీ మంత్రి , సీనియర్ నాయకులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంఎల్ఏ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మధ్య ఏదాది నుంచి ప్రచ్ఛన్న యుద్ధమే సాగుతోంది. ఇద్దరు వ్యక్తిగత దూషణలు దిగుతున్నారు. ఇటీవల ఇవి శృతిమించి ప్రశాంతిరెడ్డిని వ్యక్తిగా అవమానపరచడం, అటు తరువాత ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి జరగడం.. కోవూరు రాజకీయాలు ఇప్పుడు రాష్ట్ర వ్యాపితంగా చర్చనీయాంశం అయ్యాయి. కోవూరులో ఏం జరుగుతుంది అనే ఆరా తీస్తున్నారు. ఈ వివాదం టిడిపి, వైసిపిలను దెబ్బతీయడం తోపాటు, ప్రసన్న ప్రశాంతిరెడ్డి రాజకీయ జీవితాలకు మాయని మచ్చగా మారుతున్నాయి.

వైసిపి అధికారంలోకి వచ్చాక రాజకీయ కక్షలు, దాడులు పెరిగాయనే చెప్పవచ్చు. గతంలో రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ విమర్శలు, ప్రతి విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు దాడులు, ప్రతిదాడులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. టిడిపి రాష్ట్ర కార్యాలయంపై దాడి. వైసిపి నేతలు చంద్రబాబు నాయుడు ఇంటిపై దాడికి యత్నం. ఇలా అనేక సంఘటనలు సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. వైసిపి ప్రభుత్వంలో పెద్ద ఎత్తున ఆరాచకాలు జరిగాయి కాబట్టే ప్రజలు ఆపార్టీకి సరైన బుద్ధిచెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అలాంటి దౌర్జన్యాలు జరగవని, ప్రజలు ప్రశాంతంగా ఉంటారని పదే పదే కూటమి నాయకులు చెప్పారు. ఇప్పుడు గత ప్రభుత్వంలో జరిగిన దౌర్జన్యాలు, అక్రమాలు, దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కోవూరు ఎంఎల్ఏ ప్రశాంతిరెడ్డిపై నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను సభ్యసమాజం తీవ్రంగా ఖండిస్తుంది. రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలకు తావివ్వకూడదని ఈ సంఘటన చెబుతోంది. రాజకీయంగా వైసిపిని టిడిపి ఈ



వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంఎల్ఏ



నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాజీ ఎంఎల్ఏ

అంశంతో ఇరుకున పెట్టి ఉండాల్సి ఉంది. ప్రసన్నకుమార్‌రెడ్డి అనుచిత వ్యాఖలకు వ్యతిరేకంగా ర్యాలీలు , ధర్నాలు, చేసి ప్రజల్లో వైసిపికి గట్టిగా బుద్ధిచెప్పాలి ఉంది. ప్రసన్నకుమార్‌రెడ్డిపై కేసు పెట్టి, జైలుకు పంపి ఉంటే బాగుండునని ఇరుపార్టీల నేతలంటున్నారు. ఇది చేయకుండా నెల్లూరు జిల్లా చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ఏకంగా ఓ ముఖ్యనాయకుని ఇంట్లోకి చొరబడి అంతంత కిరాతంగా వ్యవహరించారు. కార్లు, టివి, ఏసి ఒక్కటేమిటి ఏది కనిపిస్తే దాన్ని ధ్వంసం చేశారు. ఈ సంఘటన చూసిన ప్రతి ఒక్కరూ ప్రశాంతిరెడ్డి అభిమానులుగాని చెప్పుకుంటున్న వ్యక్తులు ఇలా చేయకూడదని ముక్త కంఠంతో చెబుతున్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ఏడాది గడిచింది..విరిద్దరూ తమ స్థాయిలో చురుగ్గా రాజకీయాల్లో పాల్గొంటున్నారు. కోవూరు నియోజకవర్గంలో వేమిరెడ్డి దంపతులు దయార్థహృదయాలుగా ఆర్థికంగా బలపడుతూ, ఎదుగుతున్న నేతలంతా గతంలో వైసిపి నేతలు కావడం విశేషం. ఈ వివాదం అంతా గత వైసిపి, ప్రస్తుత వైసిపి నేతల మధ్య సాగిందని తెలుస్తోంది. నల్లపరెడ్డి కుటుంబం రాజకీయాల్లో 60 సంవత్సరాలుగా నెల్లూరు జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంది. కోవూరులో జరిగిన సంఘటన కొందరు అతి విశ్వాసపరులతోనే వచ్చిందని అందరూ భావిస్తున్నారు. వేమిరెడ్డి దంపతలు వద్ద మంచి మార్కులు కొట్టేసి ఆర్థికంగా బలపడాలని చేసిన వ్యక్తులు వ్యవహారంగా రాజకీయ పరిశీలకు అంచనా వేస్తున్నారు. ఈ కారణంతోనే ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాల్లో కోవూరు ముందుకొచ్చిందని తెలుస్తోంది. ఏది ఏమైనా ఇందులో ప్రసన్నకుమార్‌రెడ్డి తప్పు ఉండగా, ప్రశాంతిరెడ్డి అదే స్థాయిలో తప్పుగా ఇరుపార్టీల నేతలు వ్యాఖ్యనిస్తున్నారు.. ఇద్దరు నాయకులు ఈ కేసులో వెనక్కి తగ్గడం లేదు. ప్రసన్న 'నా వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా'నని చెబుతున్నారు. ప్రశాంతిరెడ్డి నాకు ఏమీ సంబంధం లేదని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చేశారని కొట్టిపారేస్తున్నారు.

'ప్రసన్న'ను అరెస్ట్ చేస్తారా..?
దాడిచేసిన వారిపై కేసు పెడతారా ?

కోవూరు సభలో ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వచ్చిన ఫిర్యాదు మేరకు రెండు రోజుల కిందటే ఆయనపై కోవూరు పిఎస్‌లో కేసు నమోదు చేశారు. ఆయనను అరెస్ట్ చేస్తారని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే దాడిచేసిన విషయంలో టిడిపికి కొంత నష్టం జరిగింది. ఇప్పుడు ప్రసన్నకుమార్‌రెడ్డిని అరెస్ట్ చేస్తే ఆయనకు, వైసిపికి కొంత సానుభూతి వస్తుందని, అందుకే అంత దూరం వద్దని టిడిపి అధిష్టానం భావిస్తోందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే 7వ తేదీ రాత్రి నెల్లూరు నగరంలోని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి జరిగింది. అప్పుడే ఎస్పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వారం రోజులు అవుతున్నా ఇప్పటి వరకు కేసు నమోదు కాలేదు. జడివాల బయటకొచ్చిన వీడియోలో టిడిపికి చెందిన కొందరు నాయకులు కనిపించారు. దీనిని పోలీసులు ఆధారంగా చేసి ఎస్పి, ఐజికి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ కేసులో ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థంకాని పరిస్థితి. గత వైసిపి ప్రభుత్వం ఇలా చేసే ప్రజల ఛీత్కారానికి గురయ్యింది. అదే బాటలో కూటమి ప్రభుత్వం పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇక్కడ న్యాయం జరగదని ప్రసన్నకుమార్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన టిడిపి, వైసిపి అధిష్టానాలు రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తున్నాయి. టిడిపి అధిష్టానం విజయవాడ నుంచే పర్యవేక్షిస్తున్నట్లు కనిపిస్తోంది. వైసిపి అధినాయకత్వం ఏం జరుగుతుందో చూద్దాం.. అన్నట్లు వ్యవహరిస్తోంది. ఈనెల 17న వైసిపి అధినేత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్‌తోపాటు, ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంటిని ఆయన పరిశీలిస్తారని సమాచారం. కోవూరులో నెలకున్న రాజకీయ సందిగ్ధత.. ఎప్పుటికి, ఎలా సర్దుబాటు అవుతుందో చూడాలి.

కరేడు ప్రాంతంలో భూసేకరణ నిలిపివేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు - 14న కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు

ఇండోసోల్ కంపెనీ ఏర్పాటుకు రైతులు భూములు ఇవ్వమంటూ కరేడు గ్రామ సభ చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని గౌరవించి కూటమి ప్రభుత్వం తక్షణమే ఆ ప్రాంతంలో భూసేకరణ నిలుపుదల చేయాలని, ఇండో సోల్ కంపెనీ ఏర్పాటుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జివో నెంబరు 43ను వెనక్కు తీసుకోవాలని ఎపి రైతు సంఘం , కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య అధ్యక్షత వహించారు., కరేడు గ్రామ ఉద్యమ నాయకులు మాట్లాడుతూ గడిచిన నాలుగు నెలల నుంచి కరేడు ప్రాంతం రైతులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాట వివరాలను వివరించారు. కరేడు గ్రామ రైతుల జీవితాలను ఈ కూటమి ప్రభుత్వం రోడ్డుమీదకు తీసుకొచ్చిన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఫిబ్రవరిలో భారత పెట్రోలియం సంస్థ ఏర్పాటుకు అవసరమైన 8,348 ఎకరాల భూ సేకరణ ఈ ప్రాంతంలో చేస్తున్నట్లు పత్రికా ప్రకటన వచ్చిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఆ గ్రామ ప్రజలతో రైతులు కలిసి పలు రకాల ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. గత నెల కూటమి ప్రభుత్వం ఈ ప్రాంతంలో భూ సేకరణకు సంబంధించిన జివో నెంబరు 43 విడుదల చేసిందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్న గ్రామాలన్నింటికంటే అతి పెద్ద గ్రామం కరేడు గ్రామమన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న చెరువు విస్తీరణం 1230 ఎకరాలన్నారు. ఇక గ్రామ స్వభావం పరిశీలిస్తే తూర్పున అర కిలో మీటరు దూరంలో సముద్రం,500 మీటర్ల దూరంలో మన్నేరు, దక్షణం వైపు అరటి, టెంకాయ తోటలున్నాయన్నారు. తూర్పువైపున సముద్రానికి అనుకొని ఏడాదికి వేరుశెనగ పంట రెండు సార్లు సాగుబడి చేస్తుంటారని, అంతే కాకుండా ఈ ప్రాంతంలో తోటకూర, గోంగూర ఇలా రకరకాలైనటువంటి కూరగాయల పంటలను రైతాంగాం సాగుబడి చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో పండిన కూరగాయలు సింగరాయ కొండ, కందుకూరు ఏరియాల్లో రైతులు విక్రయిస్తుంటారన్నారు .అటువంటి ప్రాంతంపై రాజకీయ నాయకులకు, ప్రభుత్వానికి, భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసే కార్పోరేట్‌శక్తుల కన్ను ఉద్దేశ్యపూర్వకంగానే పడిందన్నారు.. రైతుల సమస్యలను ప్రపంచానికి తెలియజేయాలన్న ఆలోచనతో 5 వేల మంది ప్రజలు, రైతాంగం కలిసి జాతీయ రహదారి దిగ్బంధనం చేశామన్నారు. 39 మంది రైతులమీద పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేశారన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో మూడు అంశాలకు సంబంధించిన తీర్మానం చేసి ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. ఈ తీర్మానాలల్లో ప్రధానంగా ఇండోసోల్ కంపెనీ ఏర్పాటుకు రైతులు భూములు ఇవ్వమంటూ కరేడు గ్రామ సభ చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని గౌరవించి కూటమి ప్రభుత్వం తక్షణమే ఈ ప్రాంతంలో భూసేకరణ నిలుపుదల చేయాలి..కరేడు గ్రామ రైతుల వ్యవసాయ రక్షణ కోసం చేస్తున్న ఉద్యమానికి, పోరాటానికి మద్దతుగా ఈ నెల 14న' సేవ్ కరేడు.. సేవ్ అగ్రికల్చర్ ' పేరుతో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి జిల్లా నుంచి శ్రీకారం చుట్టాలన్నారు. కరేండు ప్రాంత రైతాంగ ఉద్యమానికి మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయం గెలవాలి.. వ్యవసాయం నిలవాలన్న నినాదంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్,,రైతు సంఘం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు ,రైతు సంఘాల నాయకులు చిరసాని కోటిరెడ్డి,సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, రైతు సంఘం నాయకులు షాన్‌వాజ్,ఏఐటియుసి జిల్లా కార్యదర్శి శంకర్ కిషోర్ , కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం నాయకులు శ్రీనివాసులరెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సాగర్, పౌరహక్కుల సంఘం నాయకులు ఎల్లంకి వెంకటేశ్వర్లు, గిరీష్, దళిత నాయకులు జాషువా, కె.వి.పి.ఎస్ నాయకులు ఆలూరు తిరుపాలు, సంఘమిత్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.రవీంద్రరెడ్డి, కరేడు గ్రామ రైతు సంఘం నాయకులు మిరియం శ్రీనివాసులు, మధురెడ్డి, మాల కొండారెడ్డి, రామలక్ష్మమ్మ, కత్తి సుజాత, జి.వి.వి కుమార్, జి.వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్య, ఎం.వి.రమణ, షేక్ రషీద్, రావినూతల మోహన్, లలితమ్మ, అక్కులయ్య,సుధాకర్ పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని, ఈ ఏడాది హాస్టళ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ. కోట్ల నిధులు మంజూరు కాగా పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు సన్నబియ్యంతో అన్నం అందిస్తూ, రుచికరమైన మెనూ ప్రకారం భోజనం పెడుతున్నామన్నారు. పరిశ్రుభతకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ హాస్టళ్ల రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో మొత్తం 71 (బాలురు 41, బాలికలు 30) వసతి గహాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ మంచి భోజనం, నాణ్యమైన విద్య అందించేందుకు కషి చేస్తున్నదని జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ తెలిపారు.



కలెక్టర్ ఆనంద్

ప్రాణాలైనా ఇస్తాం.. భూములు ఇవ్వం..

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :కందుకూరు నియోజకవర్గం కరేడు వద్ద సుమారు 4300 ఎకరాలు భూమి స్వీకరించడంతోపాటు, గిరిజన, దళిత కాలనీలు ఖాళీ చేయించడానికి ప్రయత్నం జరుగుతుందని, ప్రాణామైన ఇస్తాం. ఇండోసోల్‌కు మా భూముల ఇవ్వమని యానాధుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య హెచ్చరించారు. శనివారం ఆ ప్రాంతంలో పర్యటించి, కాలనీలు చూడడం తోపాటు, పంట పోలాలు పరిశీలించారు. యానాదుల సంక్షేమ సంఘం బందం ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ పరిధిలో ని పొల్లుకటసంఘం, రామకష్ణ పురం, ఆకుతోట యానాది కాలనీలో పర్యటించింది. భూసేకరణకు వ్యతిరేకంగా గిరిజన, ప్రజా సంఘాలు, రైతులు, వివిధ పార్టీలకు తమ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతొందని తెలిపారు. నెల్లూరు జిల్లా అధ్యక్షులు మానికల మురళీ, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, ఒంగోలు జిల్లా అధ్యక్షులు కొమరగిరి మాల్యాద్రి, ఉపాధ్యక్షులు చేవూరు దుర్గా ప్రసాద్, ఇండ్ల మల్లి, వై ప్రసాదరావు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : ఆకలితో ఉన్న వారి ఆకలిని తీరుద్దాం వాళ్ళ కళ్ళల్లో ఆనందాన్ని చూద్దాం అనే నినాదంతో చేయి చేయి కలుపుదాం ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం అంటూ శ్రీ రామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా పొన్నలూరు తహాశీల్దార్ ఉయ్యాల పుల్లారావు సహకారంతో కందుకూరు విప్పగుంట రోడ్డులోని మార్కెట్ యార్డ్ గోడ పక్కన నివసిస్తున్న పేదలకు మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు పండ్లు పంపిణీ చేశారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, సభ్యులు ఇన్నమూరి శ్రీనివాసులు, సోమిశెట్టి శశాంక్ గుప్తా పాల్గొన్నారు.

12 కేజీల గంజాయి పట్టివేత

నెల్లూరు సంక్షేమం :గంజాయి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవడంలో భాగంగా నెల్లూరు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సుధాకర్ నేతత్వంలో నెల్లూరు, కావలి, గూడూరు రైల్వే పోలీస్ స్టేషన్లలో ఆర్పిఎఫ్ సిబ్బంది కలిసి శుక్రవార విస్తత తనిఖీలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని గూడూరు రైల్వే స్టేషన్ లో ప్లాట్‌ఫామ్ నెంబర్ 4 వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గుడూరు ఆర్‌పిఎస్‌ఐ కేసు నమోదు చేశారు. నెల్లూరు డి ఎస్ ఆర్ పి జి మురళీధర్ శనివారం కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. గంజాయితో పట్టుపడ్డ హరిహరన్ తిరుపూర్, తమిళనాడు వాసిగా గుర్తించారు. అతని వద్ద నుండి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.దాని విలువ సుమారు రూ.1,20,000 ఉంటుంది. గంజాయి సరఫరా వ్యవస్థలో సంబంధిత వ్యక్తులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందని మురళీధర్ తెలిపారు. తనిఖీలలో పాల్గొన్న రైల్వే సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ.సుధాకర్, ఆర్ పి ఎస్ ఐ జి. మాలకొండయ్య , రవి వెంకటేశ్వర్లు కిరణ్‌లను మురళీధర్ అభినందించారు.



ఉచిత బస్సు ప్రారంభం

నెల్లూరు :నెల్లూరు నగరం నుంచి నారాయణ ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం నారాయణ ఆస్పత్రి వారు వారు ఉచిత బస్సు సేవలను ప్రారంభించారు.ఈ సందర్భంగా నారాయణ మెడికల్ కళాశాల హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు మల్లి దొరసానమ్మ మాట్లాడారు.

అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-నెల్లూరు :ఊపిరితిత్తుల వ్యాధికి సంబంధించి అరుదైన చికిత్స అందించి 22 ఏళ్ళ యువతి ప్రాణాలను మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు కాపాడారు. దీనికి సంబంధించి నెల్లూరు రూరల్ పరిధిలోని మెడికల్ హాస్పిటల్ లో శనివారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లాలోని బుద్వేల్ ప్రాంతానికి చెందిన యువతికి తీవ్రమైన ఊపిరితిత్తి సమస్య, నిరంతరం దగ్గుతో హాస్పిటల్ కు తీసుకువచ్చారన్నారు. అత్యాధునిక శస్త్రి చికిత్స చేసినట్లు తెలిపారు. క్లస్టర్ హెడ్ జి రంజిత్ రెడ్డి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సెంటర్ హెడ్ లావణ్య, క్యాన్సర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ పవన్, డాక్టర్ రంగనాథన్ తదితరులు పాల్గొన్నారు



'రియల్' మోసగాళ్లను అడ్డుకోండి..



ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి : రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో నకిలీ డాక్యుమెంట్లతో మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఉదయం స్థానిక నెల్లూరు నగర డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారి, వేదాయపాలెం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు రియల్ ఏస్టేట్ వ్యాపారుల సంఘం వినతి పత్రాలు అందజేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కు రాధాకష్ణ గౌడ్ మాట్లాడుతూ నెల్లూరు నగరంలో ఎన్నో సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎంతో హుందాగా కొనుగోలు, అమ్మకాల్లో జరుపుకుంటూ ప్రాపర్టీలు అమ్మకందారులు కొనుగోలుదారులు మధ్యవర్తులు కలసి మెలసి మంచి సహద్భావ, ప్రేమ పూర్వక వాతావరణంలో వ్యాపారం జరుగుతుండేదన్నారు. నేడు కొంతమంది మోసగాళ్ళు, చీడపురుగులు, నయవంచకులు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్రవేశించి ప్రజలను నిట్ట నిలువునా మోసం చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అక్రమ ధనార్జనే ధ్యేయంగా మూడు నకిలీ డాక్యుమెంట్లు, ఆరు దొంగ ప్లాట్లు అన్నట్లుగా దొంగ డాక్యుమెంట్లు సష్టించి తమవి, తమవారివి, కాని ప్లాట్లను నకిలీ డాక్యుమెంట్లతో తమవి, తమవారీవిగా సష్టించి ప్లాట్లను చలామణిలో తెస్తూ కొంతమంది మాఫియాగా ఏర్పడి అమ్మ కాలుకు పాల్పడుతూ విచ్చలవిడిగా చలరేగిపోతున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. దనేష్ నాయుడు జిల్లా అధ్యక్షులు కే. శ్రీనివాసులు జిల్లా నాయకులు జే. అవినాష్, ఎం. రవి ఇతర నాయకులు పాల్గొన్నారు.

'వీడే మన వారసుడు' సినిమా విజయవంతం కావాలి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రాంతం వాసి తీసిన 'వీడే మన వారసుడు' సినిమా విజయవంతం కావాలని పట్టణ ఎస్ ఐ శివ నాగరాజు అన్నారు. శనివారం పట్టణంలోని ఆదిత్య గ్రాండ్ రెస్టారెంట్లో ఈనెల 18న విడుదలతున్న వీడే మనవారసుడు' సినీ ప్రమోషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ శివ నాగరాజు మాట్లాడారు. సినిమాతో పాటు మంచి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఉప్పు రమేష్ ను అభినందించారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదం జరిగినప్పుడు తలకు తీవ్ర గాయాలు కావడంతో అనేకమంది చనిపోతున్నారని ఈ విషయాన్ని దష్టిలో ఉంచుకొని హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సినిమా విజయవంతం కావాలని ఉప్పు రమేష్ కు సినిమా యూనిట్ సభ్యులందరికీ శివ నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాత, దర్శకుడు హీరో రమేష్ మాట్లాడుతూ డబ్బు సంపాదన కోసం సినిమా రంగంలోకి రాలేదని తన ద్వారా సమాజానికి మంచి జరగాలని ఉద్ధేశ్యంతో సినిమా తీసినట్లు తెలిపారు. సినిమాలో ముఖ్యంగా మూడు అంశాలను ప్రస్తావించినట్లు తెలిపారు.రైతుల కష్టాలు, బాల్యవిహాలు, విద్యార్థుల చెడు ప్రవర్తన కు ఎలా ఆకర్షితులవుతున్నారు అనే అంశాలను ప్రధానంగా ప్రస్తావించినట్లు తెలిపారు.ఈనెల 18వ తేదీన కందుకూరులోని కోటేశ్వర థియేటర్, పోకూరు, గుడ్లూరు థియేటర్లలో సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. నటుడు ఆనంద్ భారతి మాట్లడారు. సినీ నటులు శర్వాణిమోహన్, కిషోర్, వెంకటేష్, రజిని ఉన్నారు.



మాట్లాడుతన్న దరశక,నిర్మాత ఉప్పు రమేష్

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి -సైదాపురం

పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్నన్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, పింఛన్ ఇవ్వాలని జిల్లా వైద్య శాఖ అధికారికి ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, మాట్లాడుతూ ఎన్ హెచ్ఎం స్కీ ఏర్పడి 20 ఏళ్లు అవు తుందన్నారు. ఆశాలు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డిఎంహెచ్ఓ కి వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా కోశాధికారి ఎస్ మధుసూదన్, ఎస్ కళ్యాణి, ఎ వాణి,ఏ జీవ,కే సునీత,ఎస్ గీత, కే సురేఖ,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.పద్మ, నాగమణి, కోశాధికారిగా పార్వతి, సహాయ కార్యదర్శులుగా అన్నపూర్ణ, అమరావతిలు ఎంపికైనాట్లు ప్రకటించారు. సైదాపురం సిఐటియు ఇన్‌చార్జి పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి-కందుకూరు :పేదరికం లేని సమాజ నిర్మాణం కోసమే కూటమి ప్రభుత్వం పనిచే స్తుందని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఉలవపాడు మండలం ఉలవపాడు పంచాయతీ అంబేద్కర్ నగర్ లో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిరుతోటి గిరి, ఎంపీటీసీ యలమందమ్మ, అంచు పోగు వాసు, బొడ్డు ప్రసాద్ తొట్టెంపూడి మాల్యాద్రి చింతల సింగయ్య, దాసరి వెంకటరావు పాలేటి నారాయణస్వామి, సన్ని బోయిన ప్రభావతి జంగాల కోటేశ్వరమ్మ బెల్లంకొండ సుభరత్తమ్మ వాయల జాలమ్మ, కట్టా కృష్ణ ఉన్నారు.



ఉలవపాడు మండలంలో..

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం తెలిపారు. మండలంలోని కలవల్ల, వలేటివారిపాలెం తదితర గ్రామాల్లో శనివారం సుపరిపానలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది.. మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం మాట్లాడారు. మోడేపల్లి నారాయణ, కాకుమాను ఆంజనేయులు, మోడేపల్లి నరసింహరావు, వలేటి నరసింహం, మోడేపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గుడ్లూరు మండలంలోని తెట్టు గ్రామ పరిధిలోని ఎస్‌టి కాలీలో టిడిపి నాయకులు ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. గుడ్లూరు మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, క్లస్టర్ ఇన్చార్జిలు, చిత్తారి మల్లికార్జున, ఉమ్మనేని సుబ్బారావు, గ్రామ నాయకులు మద్దసాని శ్రీనివాసులు, కే.వెంకటేశ్వర్లు షేక్ చినబాబు, వెంకటేశ్వర్లు, జాలరామయ్య, తెట్టు, మోచర్ల, గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాలకొండలో యాత్రికుల సందడి

ప్రజాశక్తి వలేటివారిపాలెం

మండలంలోని మాల కొండ మాల్యాద్రి లక్ష్మీనరసిం హా స్వామి ఆలయాన్ని శనివారం ప్రకాశం జిల్లా జడ్జి ఎ. భారతి, గుంటూరు జిల్లా ఎస్పి రవిచంద్ర వేర్వేరుగా దర్శించుకున్నారు. వాళ్లకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. వారి చేత ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, స్థానిక ఎస్ఐ మరిదినాయ డు నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హరకుమార్ ఉన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కందుకూరు : ఇస్లాం దూదేకుల కమిటీ రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని ఎంఎల్ఎ చేతుల మీదుగా విద్యార్థి అర్షియాజ్ కు శనివారం అందజేశారు. మండలంలోని ఓగూరుకు చెందిన పేద విద్యార్థిని షేక్ అర్షియాజ్‌కు చదువుకు రూ. 10,000 ఆర్థిక సాయాన్ని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు అందజేశారు. ఇటీవల జరిగిన 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థిని అర్షియాజ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతిలో 600కి 577 మార్కులు సాధించి మండలంలో రెండవ స్థానం పొందింది. ఆమె ప్రతిభకు గుర్తింపు లభించి నూజివీడు ట్రిబుల్ ఐటీలో ఉచిత సీటు లభించింది.కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండడంతో చదువును కొనసాగించలేని పరిస్థితిని గుర్తించిన ఎంబిఎ నాగూర్ బాబు, ఇస్లాం దూదేకుల కమిటీ (కువైట్–ఇండియా, రాజంపేట) వారి ద్వారా విద్యార్థి చదువు కొరకు 25,000 ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే ఇంటూరి చేతుల మీదుగా కందుకూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విద్యార్థికి అందజేశారు. ఎంబిఎ నాగూర్ బాబు, గుండవరపు నరసింహారావు, తేల్ప్రొలు రామకష్ణ, జిల్లెలముడి మస్తాన్, ఖాదర్ భాషా ఉన్నారు.



బియ్యం వితరణ


ప్రజాశక్తి - వలేటివారిపాలెం :అయ్యవారి పల్లి పంచాయతీలోని మాలకొండ లో వెలిసియున్న మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో ప్రతి శనివారం నిర్వహించే నిత్య అన్నదానానికి పీసీపల్లి మండలం లక్కక్కపల్లి గ్రామానికి చెందిన బద్దెల మాలకొండా రెడ్డి (డీలర్) కుమారుడు బద్దెల లక్ష్మణ్ రెడ్డి 1,116 కేజీల బియ్యాన్ని శనివారం ఆలయ కార్యనిర్వ హణాధికారి ఎస్ చంద్రశేఖర్ కు అందజేశారు. స్వామి వారి సన్నిధిలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు భక్తులు ముందుకు రావడం ఎంతో శుభపరిణామమని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ చంద్రశేఖర్ అన్నారు.

దాడులతో భయపెట్టలేరు..

ప్రజాశక్తి నెల్లూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం పరిపాలనపై దష్టి పెట్టకుండా కుట్రపూరిత కక్ష సాధింపు రాజకీయాలు చేసి వైసిపి నాయకులను భయపెట్టాలని చూస్తుందని, అటువంటి వాటికి వైసిపి నేతలు, కార్యకర్తలు భయపడరని వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు జయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక డైకాస్ రోడ్ లోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జయకుమార్ రెడ్డి మాట్లాడారు. ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడిన వారిని, ప్రోత్సహించిన వారిని వెంటనే అదుపులోకి తీసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. లేదంటే ఉద్యమిస్తామన్నారు. వైఎస్ఆర్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి రాజేష్, మరియు వైఎస్ఆర్టిసి నాయకులు పాల్గొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచండి..

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో వరి పంట సాగు విస్తరణంగా జరుగుతుందని, అందుకు తగిన విధంగా రైతుల అవసరాలకు తగ్గట్టుగా యూరియా సప్లయ్ లేకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల గురునాథం అన్నారు. శనివారం సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం రెండో పంట కింద 3,50,000 ఎకరాలకు సాగు నీరందిస్తామని ప్రకటించిందన్నారు. దీంతో జిల్లా రైతులు సంతోషించి వరి పంటను సాగు చేసేందుకు పూనుకొన్నారు. ఇప్పటికే సుమారు రెండు లక్షల ఎకరాల్లో నాట్లు వేశారన్నారు. మరో రెండు లక్షల ఎకరాల్లో నారుయాతులకు సిద్ధంగా ఉన్నారు. భూమికి కావాల్సిన యూరియా తో పాటుగా కాంప్లెక్స్ ఎరువులు అవసర ముందన్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా ఎరువులు దుకాణాల్లో రసాయనిక ఎరువులు అందుబాటులో లేవన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి రైతులకు సకాలంలో రసాయనికి ఎరువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులు రోడ్డెకాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. చల్లకొలుసు మల్లికార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

నిందితులను పట్టుకుంటాం : డిఎస్‌పి

ప్రజాశక్తి-ఉదయగిరి



హమీద్ హత్యకు కారకులైన హనీఫ్ అన్నదమ్ములను త్వరలోనే పట్టుకుంటామని కావలి డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం జరిగిన హమీద్ హత్య ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ప్రయివేటు అల్ ఖైర్ ఫంక్షన్ హాల్ ఆర్థిక వ్యవహారాలతోనే షేక్ మహమ్మద్ హమీద్ (30) అహ్మద్ హనీఫ్, ఉమ్మర్‌అలీ ఇద్దరు అన్నదమ్ములు మారణాయుధాలతో హత్య చేశారన్నారు. ఈ హత్యపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని నిందితులు ఇద్దరేనా.. వేరేగా ఎవరైనా ఉన్నారా.. అనే కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు. త్వరలోనే పట్టుకొని వారికి శిక్ష పడేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శీనయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు'



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పలు వార్డుల్లో ఆత్మకూరు మున్సిపాలిటీ) తొలి అడుగు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడాది పాలనలోని విజయాలను ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ ఫలాలు, వారి సమస్యలను సేకరించి వాటిని త్వరగా పరిష్కరిస్తామని వారికి తెలియజేశారు. నెలరోజుల ప్రజల్లోనే ఉండనున్న టిడిపి నాయకులు ఈ కార్యక్రమం గురించి ప్రతిఒక్క నాయకులు, కార్యకర్తలు తనవంతు బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాల్సిందిగా వారు కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షులు మూడవ వార్డు కౌన్సిలర్ గౌస్ బాషా, తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, టిడిపి నాయకులు దాసరి మధు, తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో చౌట భీమవరం గ్రామ పంచాయతీలో బిసి కాలనీలో శనివారం సాయంత్రం సుపరి పాలనలో తొలి అడుగు అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదాల మాల్యాద్రి (యూనిట్ ఇన్‌ఛార్జి), నీటి సంంఘం అధ్యక్షులు దామెర హజరత్ అయ్యా, వెలుగోటి ప్రసాద్, డి.అనిల్ కుమార్, చల్లా రవణమ్మ, మాదాల సత్యం, గుడిమెట్ల మాల్యాద్రి, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేశారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు సన్మానం



ప్రజాశక్తి-కోవూరు : పాటూరు గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విశిష్ట సేవలు అందించిన చింత మౌనికకు గ్రామంలోని తూర్పు పల్లిపాలెం రైతులు ఘనంగా సన్మానం చేశారు. బదిలీపై వెళ్లిన సందర్భంగా శనివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అత్తిన వెంకోజీరావు ఆమె సేవలను ప్రశంసించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం, మద్దతు అందించడంలో మౌనిక పాత్ర ఆదర్శనీయమని పేర్కొన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించడంలో ఆమె ముందుండారని, గ్రామ అభివృద్ధికి ఆమె సేవలు ఎంతో దోహదపడ్డాయని కొనియాడారు. మౌనిక తన విధుల్లో భాగంగా ప్రభుత్వ సహాయాన్ని దాదాపు 100 శాతం మంది రైతులకు చేరేలా కృషి చేశారు. ధాన్యం అమ్మకాల సమయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా పత్రాలు సమకూర్చడం, ఆన్లైన్లో విజయవంతంగా పేమెంట్లు వచ్చేలా చేయడం వంటి సేవలు అందించారని వివరించారు. కార్యక్రమంలో గండవరపు సుబ్రహ్మణ్యం, కరకంబాకం వెంకటేశ్వర్లు, మేనాటి బాలకృష్ణ, గండవరపు వెంకట రమణయ్య, బొత్తి సుబ్బారావు, నెడలూరు భాస్కర్‌రెడ్డి, పాకం ప్రసన్న, గండవరపు రవి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కోనేటిలో మృతదేహం లభ్యం



ప్రజాశక్తి-బిట్రగుంట : కొండ బిట్రగుంట గ్రామంలో వెలసి ఉన్న బీలకూట క్షేత్ర శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి కోనేటిలో పురుషుడి మృతదేహాన్ని శనివారం స్థానికులు గుర్తించిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఈ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దర్శన అనంతరం అన్నదాన సత్రంలో భోజనం చేసుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా కోనేటిలో నీరు తాగేందుకు దిగి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లుగా స్థానికులు అంటున్నారు. మృతుడు బోగోలు పంచాయతీ కుమ్మరి వీధిలోని ఎస్‌సి కాలనీకి చెందిన పూర్ణచందర్ (32)గా గుర్తించారు. విషయం తెలుసుకున్న బిట్రగుంట పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రభాకర్ ప్రభాకర్ రావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని కావలి ఏరియా హాస్పిటల్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, స్థానిక టిడిపి నాయకులు రాయి విజయ్ యాదవ్, బోగిరి ప్రభాకర్, హరిబాబు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని దగ్గర ఉండి అంబులెన్స్‌లో తరలించారు.


రాము నియామకం



ప్రజాశక్తి-నెల్లూరు నగరం : బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ లాకా వెంగలరావు, తనను బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తాళ్లూరు రాము తెలిపారు. నగరంలోని రాధే గెస్ట్ ఇన్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో రాము మాట్లాడారు. నవనిర్మాణ సేన నాయకులు తనను ప్రధాన కార్యదర్శిగా నియమించడంలో సహాయ సహకారాన్ని అందించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. బిసి సంఘం ఆధ్వర్యంలో బిసిలందరికీ అభివృద్ధి బాటలో తీసుకువెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నరసింహారావు, జిల్లా అధ్యక్షులు బొమ్మి కిషోర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పద్మజా యాదవ్, నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులు ఆర్కాట్ కుమార్, రాష్ట్ర మహిళా కార్యదర్శి మల్లి లక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవాలు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గత మూడు రోజులుగా ఆంజనేయ స్వామి పవిత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడవరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి విశ్వక్సేన పూజ, పుణ్య హవాచనము, అగ్ని ధ్యానం, హోమములు, కుంభార్చన, స్వామివారికి అగ్నిగుండంల పవిత్ర సమర్పణ, విశేష హోమములు, నైవేద్యం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అనంతరం అన్నదానం 500మంది భక్తులకు పైగా ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుండి అగ్ని ద్యానము, కుంభార్చన, హోమము, పారమాత్మిక మంత్ర మహా శాంతి హోమం, అర్చన, ప్రసాద వినియోగం నిర్వహించారు. అలాగే చివరి రోజు ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం ఘనంగా జరుగుతుందని, సీతారాముల కళ్యాణం మహోత్సవంలో అన్నమాచార్య సంకీర్తనలు తిరుపతి వారిచే జరుగుతాయని, వందలాది మంది భక్తులు పాల్గొని శ్రీ సీతారాముల కళ్యాణం జయప్రదం చేయాలని, అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, ఆలయ అర్చకులు భాను ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ఉభయకర్తలు, భక్తులు వందలాదిగా పాల్గొన్నారు.



వైద్య శిబిరం

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్ : డెంగీ జ్వరం దోమల ద్వారా సంక్రమించే వ్యాధి అని డాక్టర్ అస్మా అన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని గిరిజన సమీకృత హాస్టల్, ఎస్‌సి బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్స్‌ను విజిట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అస్మా మాట్లాడుతూ జాతీయ డెంగీ మాసోత్సవాలలో భాగంగా హాస్టల్స్‌లో కీటక జనిత, సీజనల్ వ్యాధులు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రత గురించి తెలియజేశారు. మెడికల్ క్యాంపు కూడా పెట్టడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ ఎస్.సుధాకర్, ఎంపిహెచ్ఎ జి.రవీంద్ర, హాస్టల్ వార్డెన్స్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

- ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ పిలుపు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ

ఆగస్టు 4, 5వ తేదీల్లో నిర్వహించే అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బీ కోరారు. శనివారం మండలంలోని సిపిఎం కార్యాలయంలో ఐద్వా నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా షేక్ మస్తాన్‌బీ మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలన్నారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి లక్ష్యాలతో ఐద్వా పనిచేస్తుందన్నారు. 1980 సంవత్సరంలో కృష్ణాజిల్లాలో ఐదు మందితో ఏర్పడిన సంఘం నేడు భారతదేశంలో ఐదు కోట్ల మహిళలు ఉన్న అతిపెద్ద సంఘంగా ఏర్పడిందన్నారు. మహిళల సమస్యలపై, మహిళలకు అన్యాయం జరగకుండా తమ సంఘం ఎప్పటికప్పుడు తమ గళం విప్పుతుందన్నారు. వీధిలైట్లు, రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, మంచి నీరు, వంటి వాటిపై అదేవిధంగా అంగన్‌వాడీలు, ఆశాల సమస్యలపై ఐద్వా పోరాడుతుందన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాల పరిపాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళలపై హత్యలు హత్యాచారాలు, మైనర్ బాలికలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వంలో నూతన మద్యం పాలసీ విధానంలో రాష్ట్ర ప్రజల కష్టాన్ని దూసేస్తున్నారన్నారు. అన్నిగ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న అధికారులు మాత్రం నిమ్మకు నిరుపెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. యువత అమూల్యమైన భవిష్యత్తును మద్యానికి తాకట్టు పెడుతున్నారన్నారు. మద్యంతో ప్రతి కుటుంబంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. అదేవిధంగా నిత్యావసర వస్తువులు ఈ ప్రభుత్వ పాలనలో అధిక ధరలలో విక్రయిస్తున్నారన్నారు. ఇటువంటి సమస్యలపై రాబోయే రోజుల్లో మండల స్థాయి నుంచి తమ కమిటీ పెద్ద ఎత్తున పోరాడుతుందని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్, సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన మహిళా సంఘం ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా చీమకుర్తి సుజన, అధ్యక్షురాలుగా ఎస్‌కె సల్మాను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జ్యోతి, స్వర్ణ, శారదమ్మ, కృష్ణమ్మ, సువార్త, సుప్రజ, అమ్మని, లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతను నివారించండి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం


మాట్లాడుతున్న ముత్యాల గురునాథం

జిల్లాలో వరి పంట సాగు విస్తారంగా జరుగుతుండగా రైతుల అవసరాలకు తగ్గట్టుగా యూరియా సరఫరా లేకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారనికౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల గురునాథం పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు జిల్లా అవసరాలకు తగ్గట్టుగా ముందస్తు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం సిపిఎం కార్యాలయం లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రెండో పంట కింద 3,50,000 ఎకరాలను సాగు నీరు అందిస్తామని తెలిపారు. దాంతో జిల్లా రైతులు సంతోషించి వరిపంటను సాగు చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. ఇప్పటికే సుమారు రెండు లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి చేసుకున్నారని తెలిపారు. మరో రెండు లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమయంలో భూమికి కావాల్సిన యూరియాతో పాటుగా కాంప్లెక్స్ ఎరువులు అవసరమని తెలిపారు.

కానీ రైతులకు డిమాండ్ తగ్గట్టుగా ఎరువులు దుకాణాల్లో రసాయనిక ఎరువులు అందుబాటులో లేక అరకొరా వస్తున్న యురియాకి రైతులు రోజుల తరబడి క్యులైన్లో ఉండాల్సి వస్తుందన్నారు. వారిచ్చే ఒకటి రెండు కట్టలతో ఏ విధంగా సాగు చేయాలో తెలియక రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. అధికార బిజెపి కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రం ఎక్కువ మోతాదులో ఎరువులు సప్లై చేస్తూ దక్షిణాది రాష్ట్రాలకు కృత్రిమ కొరత సృష్టిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు సకాలంలో రసాయనికి ఎరువులు అందించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో రైతన్నల తరఫున తాము రోడ్డు ఎక్కాల్సి వస్తుందన్నారు. కార్యక్ర మంలో చల్లకొలుసు మల్లికార్జున పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

వెల్లంటిలో క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ మండలంలోని వెల్లంటి జిల్లా పరిషత్ హై స్కూల్ లో నెల్లూరు, తిరుపతి సంయుక్త జిల్లాల పండరి భజన గురువులు, డోలుమాస్టర్లు, హార్మోనియస్టులు బృందం ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పెద్దలు ఎర్రయపల్లి పెంచలదాస్, డోలు మాస్టర్ యానదయ్య, ఆదురుపల్లి శీనయ్యల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా పాత వెళ్ళంటి సర్పంచ్ పాదర్తి రాధా, కొత్త వెళ్ళంటి సర్పంచ్ తురిమెర్ల లక్ష్మమ్మ, మాజీ ఎంపిటిసి పూడిపర్తి జనార్ధన్ విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెంచలదాస్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కళాకారులు కళలకే పరిమితం కాకుండా వారి మానసిక ఉల్లాసానికి దోహదపడేందుకు ఈ పోటీలు చేపడుతున్నామన్నారు. కళాకారులకు ఈ పోటీలు మానసికం గాను శారీరకం గాను ఉపయోగపడతాయన్నారు. కావున కళాకారులు అందరూ ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఏం.నర్సారెడ్డి, టీ.సీతారామయ్య, కెప్టెన్‌లు హరిబాబు, నాయబ్, పరమేశ్, తదితర కళాకారులు పాల్గొన్నారు.

కాలనీలకు మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో నిరుపేదలైన షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు నివసిస్తున్న కాలనీలకు మౌలిక వసతులు కల్పించి ముఖ్యంగా ప్రతి కాలనీకి సామాజిక భవనాన్ని నిర్మించి వారిలో చైతన్యాన్ని పెంపొందించాలని జిల్లా ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలపై అధికారులు ఈ కాలనీలను సందర్శించి, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేసి, వారిని అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే ఐటిడిఎ అధికారులు గిరిజన కాలనీలను సందర్శించి, గిరిజన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, మరీ ముఖ్యంగా బడి బయట తిరుగుతున్న బాలబాలికలను పాఠశాలలు జరిపించి, వారికి విద్యాబుద్ధులు అందించాల్సిన అవసరం సమాజంపై ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు అధికారులు నిరంతరం నిరుపేద లైన ఎస్‌సి ఎస్‌టి కాలనీల ప్రజలను చైతన్యపరిచి రాజ్యాంగ నిర్మాతలు కలలు కన్న, నవ సమాజాన్ని నిర్మించడానికి నిరంతరం కృషి చేసి, వారి అభ్యున్నతికి పాటు పడాలని కోరారు.

ప్రసన్న వ్యాఖ్యలపై టిడిపి నేతల ధ్వజం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



హీనమైన చరిత్ర కలిగిన ప్రసన్న కుమార్ రెడ్డి ఆకాశమంత ఎదిగిన తమ ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటని జొన్నవాడ టిడిపి నాయకులు ధ్వజమెత్తారు. మండలంలోని జొన్నవాడ గ్రామంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అవినీతి, అక్రమాలతోపాటు భారీ ఎత్తున కమిషన్లు దండుకున్న చరిత్ర ప్రసన్నకుమార్ రెడ్డి ఒక్కడిదేనన్నారు. 410 ఎకరాలలో ఉన్న జొన్నవాడ ఇసుక రీచ్‌ను ఎనిమిది వందల ఎకరాలకు పైగా ఇసుక తవ్వుకున్న ఘన చరిత్ర వైసిపి నాయకులదని విమర్శించారు. నియోజకవర్గంలో జరిగిన ప్రతి అవినీతి, అక్రమాలలో ప్రసన్న కుమార్ రెడ్డి హస్తమందని ఆరోపించారు. అవినీతిలో కూరుకుపోయిన ఆయన ఆది దంపతుల వంటి విపిఆర్ దంపతులను విమర్శించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందికట్టు పెంచలయ్య, పురిణి హరినాథ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నాయకులు సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం


మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు ఒకటిగా కలిసి ఉంటేనే ప్రజల సమస్యలను, అభివృద్ధి పనులను చేయగలరని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని జొన్నవాడ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని ప్రతి ఇంటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు ఎటువంటి అపోహలకు పోకుండా పాత, కొత్త నాయకులు కలిసికట్టుగా ఉంటూ ముందుకు సాగాలన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అస్తవస్తంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ లోపాలను సరిదిద్దుకుంటూ పాలన అభివృద్ధి పథంలో ముందుకు సాగిస్తున్నారన్నారు. ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్న ఇచ్చిన మాట కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందిస్తున్నారన్నారు. ల్యాండ్ టైటిల్ రద్దుచేసి, పెన్షన్‌లను పెంచి ఉచిత ఇసుక గ్యాస్ పథకాలను రాష్ట్ర ప్రజలకు అందజేశారన్నారు. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారని ఆమె వెల్లడించారు. జొన్నవాడ గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. అమ్మవారి దయతో గతంలో కుంభాభిషేకం చేసి అమ్మవారి ఆశీస్సులు పొంది ఎంఎల్ఏగా గెలిచామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందికట్టు పెంచలయ్య, ఉమామహేశ్వర రావు, వెంకటరత్నం, భాస్కర్ రెడ్డి, హరినాద్, హరికృష్ణ, గోపిరెడ్డి, వంశీ కృష్ణారెడ్డి, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్‌పేటలో సైబర్ మోసం

- రూ.60వేలు పోగొట్టుకున్న బాధితుడు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట


వివరాలు తెలుపుతున్న బాధితుడు

స్థానిక బస్టాండ్ సెంటర్లో మీసేవ నడుపుతున్న మల్లే హజరత్ అయ్యా అనే వ్యక్తి సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి రూ.60వేల నగదు పోగొట్టుకున్నారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుడు చెప్పిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఐదు గంటల పది నిమిషాల సమయంలో సమీపంలోని వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు దినేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి అన్నా డబ్బులు ఏమన్నా ఉన్నాయా.. అని అడగడంతో, ఎంత అని తాను అడగగా రూ.80వేలు కావాలని చెప్పాడన్నారు. తన దగ్గర రూ.60వేలు మాత్రమే ఉన్నాయని చెప్పానని తెలిపారు. అనంతరం ఐదు నిమిషాల వ్యవధిలోనే 9494410130 నెంబర్‌తో ఫోన్ వచ్చిందన్నారు. ఆ ఫోన్‌లో "ఇప్పుడు మీకు దినేష్ ఫోన్ చేశారు కదా అమౌంట్ రెడీగా ఉందా" అని సైబర్ నేరగాడు అడుగగా రెడీగా ఉందని చెప్పానని, ఆ డబ్బును వెంటనే 9573877403 అనే నెంబర్‌కు ఫోన్ పే చేయండని కాన్ఫరెన్స్ కాల్‌తో వేరే వాడితో మాట్లాడుతూ ఉన్నట్టుగా నటించి దినేష్ దగ్గర రూ.60,600 ఇచ్చేయమ్మా హజరత్‌అయ్యా మనకు ఫోన్ పే చేస్తున్నాడని చెప్పడంతో నమ్మి ఫోన్‌పే చేయడం జరిగిందని తెలిపారు. ఐదు నిమిషాల తర్వాత తాను వాటర్ ప్లాంట్ దగ్గరికి వెళ్లి దినేష్ డబ్బులు ఏవి అని అడగగా, వాళ్లు నాకు డబ్బులు ఇవ్వలేదని సమాధానం చెప్పాడన్నారు. తాను మా మీ సేవలోని కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా చెక్ చేయగా తాను ఫోన్ పే వేసిన వ్యక్తి పేరు ట్రూ కాలర్‌లో అడపా సాయికృష్ణ అని వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తనకు కాల్ చేసిన వ్యక్తి పేరు ట్రూ కాలర్‌లో ఆనందరావు ఎఎస్‌ఐ అని ఉందని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. అదేవిధంగా సైబర్ క్రైమ్ ఆఫీస్‌కు కూడా కంప్లైంట్ చేయడం జరిగిందన్నారు.

ఆత్మకూరులో పరస్పర ఫిర్యాదులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పోలీస్ స్టేషన్ వద్ద వెంకట్రావుపల్లి గ్రామస్తులు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డ్ వెంకట్రావుపల్లిలో అధికార పార్టీలో రెండు వర్గాలు ఉన్నాయి. వారిలో ఒకరు ఇంటింటికి ప్రచారం చేసేటప్పుడు ఇక్కడ మీరు ఎందుకు ప్రచారం చేస్తున్నారని మరొకరు ప్రశ్నించడంతో వారి మధ్య వివాదం రేగింది. దాంతో ఈ గ్రామానికి చెందిన పాతపాటి ప్రమీల తనను స్థానిక కౌన్సిలర్ దుర్భాషలాడారని ఫిర్యాదు చేసింది. మరోవైపు ఇరగన వెంకటేశ్వర రెడ్డి అనే వ్యక్తి విజయ్ అనే వ్యక్తిపై ఫిర్యాదుచేశారు. తామ ప్రచారం చేస్తుంటే అడ్డుకుంటున్నారనేది వీరి ఫిర్యాదు. ఇలా ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసిన పిలిచి విచారించలేదని శనివారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో మహిళలు బైఠాయించారు. రెండు ఫిర్యాదులను విచారిస్తామని ఎస్ఐ జిలాని తెలిపారు.

ఈకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని రైతన్నలు వారి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో ఈకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు పత్రికాముఖంగా తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవకు మండలంలో మొత్తం 8239 నమోదు చేయగా అందులో 5311 ఈ కెవైసి కంప్లీట్ చేయాలని జాబితా వచ్చిందన్నారు. అందులో ఇప్పటివరకు 5186 ఈకెవైసి కంప్లీట్ చేయడం జరిగిందన్నారు. కౌలు రైతులు విఆర్ఒ వద్ద కౌలు కార్డు చేయించు కొని 13వ తేదీలోగా తిరిగి కొత్తగా అన్నదాత సుఖీభవకు నమోదు చేసుకోవచ్చన్నారు.


కోడి పందేల స్థావరంపై దాడి

- పెద్ద ఎత్తున నగదు, మోటార్ బైకులు స్వాధీనం

ప్రజాశక్తి కొండాపురం

మండలంలోని సాయిపేట సమీప ప్రాంతలో కోడిపందాల స్థావరంపై కొండాపురం కలిగిరి ఎస్ఐలు ఉమాశంకర్, జాజిల మాల్యాద్రి సంయుక్తంగా కలిసి దాడులు నిర్వహించారు. 42 మోటార్ సైకిళ్లు, రూ.8,80,000, 12 కోళ్లు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. అయితే పోలీసులు మాత్రం నాలుగు కోళ్ళ ఏడుగురు పందెం రాయుడు రూ.39వేల నగదు 28 బైకులు దొరికినట్లు చెబుతున్నారు. ఇంత మొత్తం మోటార్ సైకిల్ నగదు దొరికితే పోలీసులు మాత్రం తక్కువ మొత్తంలో చూపించటం మండలంలో చర్చనీయాంశంగా మారింది. అయితే సాయిపేట వైసిపి నాయకుడి కుమారుడే కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం పోలీసులకు మామూలు ఇచ్చి లైసెన్స్ తెచ్చామని నిర్భయంగా కోడిపందేలలో పాల్గొనవచ్చని పందెం రాయుళ్లను పిలిపించినట్లు సమాచారం. శనివారం 15 జతలు కోళ్లను ఒప్పందం చేసుకొని ఒక్కో జతకు రూ.లక్ష పందెం వేసేలా కుదుర్చుకొని కోడిపందేలు నిర్వహించారని సమాచారం. దాంట్లో ఇప్పటివరకు కొంతకాలంగా కొండాపురం ఎస్ఐ బదిలీపై వెళ్లడం కొత్త ఎస్ఐ రాకపోవడంతో స్థానికంగా ఉన్న పోలీసులు హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. శనివారం రోజు నూతన ఎస్ఐగా జాయిన్ అయినా జాజుల మాల్యాద్రి, కలిగిరి ఎస్ఐ దాడి చేస్తారని తెలియక పందెం రాయుళ్ల దొరికినట్లు సమాచారం. మధ్యాహ్నం సుమారు ఒంటిగంట ప్రాంతంలో పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్న అర్ధరాత్రి వరకు మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం వెనుక అంతరార్థం ఏమి దాగుందోనని మండలంలో చర్చించుకుంటున్నారు.

ట్రాక్టర్ దగ్ధం



ప్రజాశక్తి-దగదర్తి : గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను తగలబెట్టిన ఘటన శుక్రవారం రాత్రి 12.30 గంటలకు మండల పరిధిలోని అనంతవరం పంచాయతీలో చోటుచేసుకుంది. బాధితులు గట్టాల మాల్యాద్రి మాట్లాడుతూ అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ తీసుకొని వచ్చి ట్రాక్టర్ పై పోసి నిప్పు పెట్టారని వారు ఆరోపించారు. ట్రాక్టర్ పూర్తిగా మంటల్లో కాలిపోవడంతో సుమారు రూ.7 లక్షలు నష్టం వాటిల్లిందని వారు తెలిపారు. ఈ విషయమై దగదర్తి పోలీస్ స్టేషన్లో కేసు పెట్టినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న పసుపులేటి పెంచలయ్య

పాఠశాలల స్వీపర్స్ మహాసభ

ప్రజాశక్తి-కావలి

సిఐటియు అనుబంధ ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ మూడవ మహాసభ శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏ. ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య పాల్గొని మాట్లాడుతూ స్కూల్ స్వీపర్స్‌కు పనిభారం చాలా ఎక్కువ అయినదని జీతాలు మాత్రం చాలా తక్కువ అని రూ.6వేలు వేతనం ఇచ్చి పనులు ఎక్కువ చేయిస్తున్నారన్నారు. తమకు వేతనాలు పెంచాలని, కనీస వేతనం అమలు చేయాలని, పోరాటాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని స్కూల్ స్వీపర్స్‌కు పనిభారం తగ్గించాలని, స్కూల్ స్వీపర్స్ సమస్యలు పరిష్కారం, వేతనాలు పెంచుకు నేందుకు ఐక్యంగా రాబోయే రోజులలో పోరాటాలు కొనసాగిం చాలని పోరాడి, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా ఏ.ఆదిలక్ష్మి, కార్యదర్శి కే.పద్మ, ఉపాధ్యక్షులు ఎం.శుభ, జాయింట్ కార్యదర్శి ఎం.శోభ, కమిటీ సభ్యులుగా టీ.వీరయ్య ఎం.మాచర్ల, ఈ.తిరుపతమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకునానరు. వీరితో పాటు స్కూల్ స్వీపర్స్ పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి-సీతారాంపురం


అంకి పుష్ప (ఫైల్)

సీతారామ పురం మండల పరిధిలోని సింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన అంకి పుష్ప (39) శనివారం పాము కాటికి గురై మృతి చెందింది. వివరాల్లోకెళ్తే.. మృతురాలి భర్త అంకిమాతయ్య గత రెండు నెలల క్రితమే అకాల మరణం చెందడంతో.. ఆమె జీవనాధారం కోసం ప్రతిరోజు వేప విత్తనాలు ఏరి వాటిని అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తుండేది. అదేవిధంగా శనివారం కూడా వేప విత్తనాలు కోసం స్థానిక అయ్యవారిపల్లి పొలిమేరలో ఉన్న వేపచెట్లు దగ్గరికి వెళ్లి వేపవిత్తనాలు వేరుకుంటూ ఉండగా పాము కాటుకు గురైంది. ఆమె పెద్దగా కేకలు వేయడంతో అక్కడే సమీపంలో ఉన్న స్థానికులు గమనించి 108కి సమాచారం అందించగా వారు వచ్చి 108 నందు స్థానిక సీతారాంపురం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆమెను తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు ఆమె మృతిపై గ్రామస్తులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.



ఎఎస్‌పేటలో ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల హెడ్ క్వార్టర్ అయిన ఎఎస్‌పేటలో అనుదినం ట్రాఫిక్ సమస్య వెంటాడుతుందని, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి ముఖ్యంగా రొట్టెల పండగ, ప్రతి శుక్రవారం మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఎక్కువైపోయి మండలానికి వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు గురవుతున్నారని, మండలంలోని పలువురు నాయకులు గ్రామస్తులు వాపోయారు. కావున ఈ విషయాన్ని గుర్తించి ఇకనైనా సంబంధిత అధికారులు మండల సిబ్బంది ట్రాఫిక్ సమస్యను అరికట్టాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నవోదయకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోసం ప్రిన్సిపాల్ ప్రకటనలో కోరారు. అభ్యర్థులు 2014 మే 1నుండి 2016 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని, దరఖాస్తులను జూలై 29లోపు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. దరఖాస్తులను అప్లోడ్ చేసేటప్పుడు కులధ్రువీకరణ పత్రంను జత చేయాలని, పూర్తి వివరాలకు, దరఖాస్తులను పూర్తి చేయడానికి https://cbseitms.rcil.gov.in/nvs చూడాలన్నారు. సందేహాలకు ఫోన్ 9346022106 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కరేడు ప్రాంతానికి ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి-నెల్లూరు

కరేడు ప్రాంతంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఇండోసోల్ కంపెనీ ఏర్పాటుకు 8348 ఎకరాల భూమి అవసరమని, ఈ మేరకు భూసేకరణ నోటిఫికేషన్ సంబంధించిన జీఓ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజలు, రైతాంగం తమ ప్రాణాలైనా అర్పిస్తాం కాని వరి పండే పొలాలను, రైతులకు, చిన్న, సన్న కారు దళిత, బహుజన రైతు కూలీలకు జీవనాధారంగా ఉన్న భూములను ఎటువంటి పరిస్థితుల్లో ఇచ్చేది లేదంటూ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ రహదారిని నిర్బంధించారు. ప్రభుత్వం ఉపసంహరించుకునే విధంగా కరేడు ప్రాంత ప్రజల నుంచి, రైతాంగం నుంచి వ్యతిరేకత రావడంతో రాజకీయ నాయకులు మాయమాటలు చెప్పి ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా ప్రజా నిర్ణయం తీసుకొనేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలు, జిల్లా అధికారులు నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల నుంచి ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ జీవోను ఉపసంహరించుకోవాలని ఏకాభిప్రాయం తెలియజేశారు. కరేడు ప్రాంత ప్రజల నిర్ణయానికి వామపక్ష పార్టీలు సైతం సంపూర్ణ మద్దతునిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. జిల్లాలో కరేడు ప్రాంత ప్రజలకు మద్దతుగా చేస్తున్న పోరాటాన్ని మరింత తీవ్ర తరం చేసేందుకు రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేపట్టేందుకు ప్రణాళిక రచన చేయడంలో నాయకులు నిమగ్నమై ఉన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఏడాది నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంతంలో నిర్వహించే రొట్టెల పండుగ ప్రశాంతంగా ముగిసింది. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంలో జిల్లా అధికార యంత్రాంగం సఫలీకృతం అయింది. ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది రెవెన్యూ క్రీడలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడల్లో కలెక్టర్ పాల్గొని రెవెన్యూ ఉద్యోగుల్లో క్రీడోత్సాహాన్ని నింపారు. జిల్లాలో మూతపడ్డ వి.ఆర్. పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు, మౌలిక వసతులు కల్పించి, నూతన హంగులతో కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా తయారుచేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో ప్రారంభించి మంత్రి నారాయణ సఫలీకృతులు కావడంతో ఎన్నికల సమయంలో ప్రజలకు ఆయన చేసిన వాగ్దానాల్లో ప్రధానమైనది పూర్తి చేసుకున్నారు. కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై కోవూరు మాజీ ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు నిరసనగా వేమిరెడ్డి సానుభూతిపరులు ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోని విలువైన వస్తువులను ధ్వంసం చేశారు.

వీక్షణం